


BEFORE THE AUTHORITY FOR ADVANCE RULING - ANDHRA PRADESH
Goods and Service Tax
D.No.12-403-4, Adjacent to N H16 Service Road, Kunchanapalli, Guntur-522501
Present
1. Sri. K. Ravi Sankar, Commissioner of State Tax (Member)
2. Sri. B. Lakshmi Narayana, IRS, Joint Commissioner of Central Tax (Member)
AAR No.09/AP/GST/2024 dated: 07.06.2024

1	Name and address of the applicant	M/s MCM Pacific Pte Ltd
2	GSTIN	[illegible]
3	Date of filing of Form GST ARA-01	[illegible].2024
4	Personal Hearing	02.04.2024
5	Represented by	Madduluru Sai Babu
6	Jurisdictional Authority - State	
7	Clause(s) of section 97(2) of CGST/SGST Act, 2017 under which the question(s) raised	(e) determination of the liability to pay tax on any goods or services or both;

లైన్‌ను తొలగించి స్క్రాప్‌కు తీసుకుపోతామని జీఎస్టీ తగ్గించమని కోరుతూ మయన్మార్ కంపెనీ రాసిన లేఖపై మినహాయింపులు ఇవ్వలేమని జీఎస్టీ అథారిటీ రాసిన ప్రత్యుత్తరం

లైన్ క్లియర్!

విజయవాడ వెస్ట్ బైపాస్‌కు మార్గం సుగమం

స్క్రాప్ కోసమే ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ లైన్ కొన్నాం

- లైన్‌ను తొలగించి మా దేశం తీసుకు వెళతాం
- జీఎస్టీ నుంచి మినహాయింపు కోరుతూ జీఎస్టీ అథారిటీకి మయన్మార్ కంపెనీ లేఖ
- మీరు ఏదైనా చేసుకోండి.. జీఎస్టీ కట్టాల్సిందేనని అథారిటీ స్పష్టం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ వెస్ట్ బైపాస్ వివాదంలో మరో సరికొత్త ట్విస్ట్ చోటు చేసుకుంది. కొండపల్లి ల్యాంకో పవర్ ప్రాజెక్టు మూత పడిన తర్వాత లిక్విడేటర్ నుంచి ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ లైన్‌ను కొనుగోలు చేసిన మయన్మార్‌కు చెందిన ఎంసీఎం కంపెనీ జీఎస్టీ అథారిటీకి ఒక లేఖ రాసింది. ఈ లేఖ సారాంశం ఏమిటంటే ల్యాంకో లిక్విడేటర్ నుంచి లైన్‌ను స్క్రాప్ కింద తాము కొనుగోలు చేశామని.. ఈ లైన్‌ను, మెటీరియల్‌ను ఊడదీసుకుని తమ దేశం తీసుకుని వెళతామని జీఎస్టీ కింద మినహాయింపులు ఇవ్వాల్సిందిగా అభ్యర్థిస్తూ లేఖ రాయటం జరిగింది. మేము ఇక్కడ వ్యాపారం చేయటం లేదని, కేవలం స్క్రాప్‌ను తమ దేశానికి తరలించుకునేందుకు మాత్రమే కొనుగోలు చేశామని పదేపదే తమ అభ్యర్థనలో పేర్కొనటం జరిగింది. దీనిపై జీఎస్టీ అథారిటీ మినహాయింపులు ఇవ్వటానికి అంగీకరించలేదు. జీఎస్టీ చెల్లించాల్సిందేనని చాలా స్పష్టంగా పేర్కొంది. దీంతో ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ లైన్‌ను కొనుగోలు చేసిన మయన్మార్ కంపెనీ పూర్తిగా ఆ లైన్‌ను ఊడపీకేయనుందని స్పష్టమైంది. విద్యుత్ హైటెన్షన్ తీగలతో పాటు, విద్యుత్ టవర్లను కూడా ఊడతీసుకుని వారి దేశం తరలించుకుపోవటానికి సిద్ధమవుతున్నట్లు పైపరిణామాలు తెలియజేస్తున్నాయి. ల్యాంకో లైన్‌ను కొన్న మయన్మార్ కంపెనీ స్పష్టంగా తొలగించుకుపోతామని చెబుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని మయన్మార్ కంపెనీకి సహకారం అందిస్తే లైన్‌ను ఊడతీసుకుని తమ దేశం తరలించుకుపోతుంది. ఇదే కనుక జరిగితే రైతుల కేసులు, ఇతర గొడవలన్నీ ఆటోమేటిక్‌గా పరిష్కారమైపోతాయి. దీంతో విజయవాడ వెస్ట్ బైపాస్ మిగిలిన పనులను ప్రారంభించటానికి దోహదపడుతుంది. రెండు, మూడు నెలల్లో ఈ పనులు పూర్తి చేయటం ద్వారా చిన్న అవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు విజయవాడ వెస్ట్ బైపాస్‌ను మిగతా 6లో..



మట్టిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న టిప్పర్లు

గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అనుచరులు పాలడుగు రాంప్రసాద్, వడ్లమూడి చిన్ని సిఫారసుతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ తాజాగా బుడమేరులో మట్టి దందాకు తెరలేపారు. ఎటువంటి అనుమతులు లేకుండా మూడు రోజులుగా వందలాది లారీల మట్టిని తవ్వి ఉంగుటూరు, ఉయ్యూరు, గన్నవరం ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన డ్రైనేజీశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. గ్రామస్థుల ఫిర్యాదుపై స్పందించిన పాములపాడు డీసీ చైర్మన్ యార్లగడ్డ రవి ఉన్నతాధికారులతో మాట్లాడి మట్టి తవ్వకాలను అడ్డుకున్నారు.

బుడమేరులో 'మట్టి' దందా!

అనుమతి లేకుండా మూడు రోజులుగా మట్టి తవ్వకాలు

ఉంగుటూరు, ఉయ్యూరు, గన్నవరం ప్రాంతాలకు తరలింపు

- గత వైసీపీ ప్రభుత్వంలో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్వాకం
- చోద్యం చూస్తున్న డ్రైనేజీశాఖ అధికారులు
- నిలుపుదల చేయించిన పాములపాడు డీసీ చైర్మన్ యార్లగడ్డ రవి

ఆంధ్రజ్యోతి-గుడివాడ: నందివాడ మండలం చేదుర్తిపాడు వద్ద బుడమేరు వెడల్పు, ఎత్తును పెంచే విధంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించారు. మాజీ మంత్రి కొడాలి నాని అండతో బుడమేరు కట్టలను పటిష్టపరచకుండా, ఎత్తు పెంచకుండా వందలాది టిప్పర్లతో కాంట్రాక్టర్ మట్టిని అమ్మేసుకున్నారు. గుడివాడలోని జగనన్న కాలనీ మెరకకు మట్టిని తరలించి కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్ము దోచుకున్నారు. గడ్డం గ్యాంగ్‌లో సదరు కాంట్రాక్టర్ కూడా సభ్యుడని వైసీపీ వర్గాలు బాహాటంగానే పేర్కొంటున్నాయి.

ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైం అనుమతులు లేకుండానే..

కాంట్రాక్టు నిర్ణీత గడువు పూర్తైన గడువు సమయాన్ని డ్రైనేజీ అధికారులు పెంచలేదు. గత వైసీపీ హయాంలో మొదలైన పనులకు ఎటువంటి ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్(ఇ.వో.టి) లేకుండానే గత మూడు రోజులుగా సదరు కాంట్రాక్టర్ మట్టి దోపిడీ సాగిస్తున్నాడు. గడువు సమయం పెంచాలని కోరుతూ కాంట్రాక్టర్ అర్జీ పెట్టుకున్నట్లు డ్రైనేజీ అధికారులు పేర్కొంటున్నారు. డ్రైనేజీ చీఫ్ ఇంజినీర్ నుంచి ఎటువంటి అనుమతులు రాకుండానే మూడు రోజులుగా యథేచ్ఛగా మట్టి తవ్వి తరలించేస్తున్నాడు.

చేదుర్తిపాడు వద్ద కట్టల పటిష్టత ఎక్కడా?

గత వైసీపీ హయాంలో బుడమేరులో చేదుర్తిపాడు వద్ద నుంచి మట్టిని తరలించుకు పోయారు. కట్టలను పటిష్ట పరచకపోవడం, ఎత్తును సరైన పరిమాణంలో పెంచకపోవడంతో గత ఏడాది వచ్చిన బుడమేరు వరదల్లో గ్రామం 20 రోజుల పాటు నీటిలో మునకేసింది. తాజాగా చేపట్టే పనుల్లో అయినా కట్టలను పటిష్ట పరిచి, ఎత్తు పెంచాలని చేదుర్తిపాడు గ్రామస్తులు కోరుతున్నారు.

పెగ్ మార్కింగ్ చేయడంతో మొదలు

డ్రైనేజీకి సంబంధించిన భూమి ఎంత మేర ఉందో ఇటీవల డ్రైనేజీ అధికారులు రెవెన్యూ అధికారులతో పెగ్ మార్కింగ్ చేయించారు. దీంతో ఎటువంటి అనుమతులు లేకుండానే సదరు కాంట్రాక్టర్ మట్టితవ్వకాలు ప్రారంభించి వేరే ప్రాంతాలకు తరలించసాగారు. ఉంగుటూరు, ఉయ్యూరు, గన్నవరం పరిధిలోని రియల్ ఎస్టేట్ వెంచర్‌లకు మట్టిని అమ్ముకున్నట్లు సమాచారం.

నిద్రావస్థలో డ్రైనేజీ శాఖ

గత మూడు రోజులుగా పగులు, రాత్రి తేడా లేకుండా బుడమేరు నుంచి మట్టిని టిప్పర్లలో తరలిస్తుంటే డ్రైనేజీ అధికారులు పట్టనట్టు మిగతా 6లో..



బుడమేరులో మట్టి తవ్వకాలు

వైసీపీ వాళ్లకు వత్తాసు

వైసీపీ సానుభూతి కాంట్రాక్టర్‌కు డ్రైనేజీ అధికారులు వత్తాసు పలుకుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మట్టి దోపిడీ జరుగుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోకుండా డ్రైనేజీ అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంపై నందివాడ మండల టీడీపీ నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తుంటే ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భూ కబ్జాలు.. సెటిల్‌మెంట్లు

వైసీపీ నాయకుడు వేల్పుల రమేశ్ నిర్వాకం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో లెక్కలేనన్ని దందాలు

భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు, బెదిరింపులు, బ్లాక్ మెయిలింగ్‌లతో వైసీపీ నాయకుడు వేల్పుల రమేశ్ చెలరేగిపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు లెక్కలేనన్ని దందాలు నడిపి కోట్లకు పడగలెత్తారు. ఎంతో మంది ఈయన వేధింపులు తాళలేక పోలీసులను ఆశ్రయించారు. ఆరు కేసులు నమోదైనా చర్యలు తీసుకోవడానికి పోలీసులు వెనుకడుగు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా బెదిరింపులు, అక్రమార్జనకు దిగడం విస్మయానికి గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు రమేశ్‌ను పోలీసులు ఆదివారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

- కూటమి ప్రభుత్వంలోనూ వెనక్కి తగ్గని వైనం
- మొత్తం రమేశ్‌పై ఆరు కేసులు నమోదు

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల రూరల్): కంచికచర్ల మండలం కీసర గ్రామానికి చెందిన వ్యక్తి వేల్పుల రమేష్‌బాబు. ఈయన సతీమణి వేల్పుల ప్రశాంతి 2014లో టీడీపీ తరఫున ఎంపీటీసీగా పోటీ చేసి గెలిచారు. పార్టీ నిర్ణయం మేరకు ఆమెను ఎంపీపీగా ఎన్నుకున్నారు. అప్పటి వరకూ కేవలం కీసర, పెండ్యాల గ్రామాలకే పరిమితమైన రమేష్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులతో స్నేహం ఏర్పరచుకొని అక్రమాలకు శ్రీకారం చుట్టారు. మండలానికే చెందిన ఒక ముఖ్య నాయకుడి అండదండలతో ఐదేళ్ల పాటు రెచ్చిపోయి ప్రవర్తించారు. రియల్ ఎస్టేట్ వ్యవహారాలలో సెటిల్‌మెంట్‌ల నుంచి భూ కబ్జాలు, బ్లాక్ మెయిలింగ్‌లతో కంచికచర్ల ప్రాంతాన్ని కంటతడి పెట్టించినట్లు తెలిసింది. అధికారుల బలహీనతలను తెలుసుకొని వారిని మానసికంగా వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలు కూడా వచ్చాయి. ఆ సమయంలోనే కోట్లాది రూపాయల ఆస్తులు సంపాదించినట్లు సమాచారం. రాజకీయంగా ప్రోత్సహించిన ఆ టీడీపీ ముఖ్య నాయకుడికి ఎదురు తిరిగే స్థాయికి చేరుకున్నారని, ఆర్థిక, రాజకీయ లబ్ధి కోసం రమేష్‌ను ప్రోత్సహించిన ఆ నాయకుడిని బహిరంగంగా ధిక్కరించి రాజకీయాలు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ఎలాగైనా రమేష్‌ను రాజకీయంగా బలహీన పరచాలన్న ఆలోచనతో సదరు నాయకుడు రమేష్ సతీమణిపై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమయ్యారని, మండల పరిషత్ సభ్యులంతా ఏకమైనా రమేష్‌ను ఏమీ చేయలేక పోయారని మిగతా 6లో..



ఎట్టకేలకు వేల్పుల రమేశ్ అరెస్టు

- అరెస్టు సమయంలో హైడ్రామా
- పోలీసులపైకి కుక్కలను ఉసిగొల్పిన రమేశ్

ఎట్టకేలకు వేల్పుల రమేశ్‌ను పోలీసులు ఆదివారం అరెస్టు చేసి కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం నందిగామ కోర్టులో హాజరుపరిచారు. వైసీపీ అధికారంలో ఉండగా, ఆయన అడ్డగోలుగా పంచాయితీలు చేయడంతో పాటు ఒప్పుకోని వారిపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఆయనపై ఆరు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులపై శనివారం సాయంత్రం అరెస్టు చేస్తారని తెలుసుకున్న రమేష్ తన అనుచరులను ఇంటికి రప్పించుకున్నారు. పోలీసులు ఇంట్లోకి రాకుండా అడ్డగించడమే కాకుండా తన ఇంట్లో కుక్కను వారిపైకి ఉసిగొల్పారు. చివరకు ఆదివారం ఉదయం ఏడు గంటలకు రమేష్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు స్టేషన్‌కు తరలించారు. పోలీస్ వాహనం ఎక్కనని పట్టుబట్టడంతో సొంత వాహనంలోనే స్టేషన్‌కు తరలించారు. మొత్తం ఐదు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

మస్తర్లతో మాయ!

ఉపాధి పనుల్లో యథేచ్ఛగా అక్రమాలు!

ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు పనిచేసినట్టుగా నమోదు

- వారి ఖాతాల్లో జమ అయిన నగదుకు వాటాలు
- పనిచేయని గ్రామాల్లోనూ జరిగినట్టుగా చూపి నిధులు పక్కదారి
- మేట్లపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు
- పట్టించుకోని అధికారులు.. ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు



ఉపాధి హామీ పథకం పనుల్లో మేట్లు మస్టర్లతో మాయాజాలం సృష్టిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు ఇక్కడ పనులు చేసినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వారి ఖాతాల్లో జమ అయిన నగదును గ్రామ పెద్దల అవతారం ఎత్తిన పలువురితో కలిసి పంచుకుంటున్నారు. పనిచేయని గ్రామాల్లో చేసినట్లుగా ఫొటోలు అప్‌లోడ్ చేసి భారీగా నిధులను పక్కదారి పట్టిస్తున్నారని గ్రామస్తులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. అయినా వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మండలం తాళ్లపాలెంలో ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలకు అంతులేకుండాపోయింది. గ్రామంలోని చికెన్ షాపులో పనిచేసే ఓ వ్యక్తి రెండు వారాలపాటు ఉపాధి పనులు చేసినట్టుగా మస్టర్లు వేశారు. అతని పేరున మొదటి విడతలో రూ.1200, రెండో విడతలో రూ.1500 నగదును జమచేశారు. ఇదే పంచాయతీలో శివారు గ్రామంగా మున్సబుగారి తాళ్లపాలెంలో అసలు ఉపాధి పనులు ఈ ఏడాది ఇంతవరకు ప్రారంభం కాలేదు. కానీ నాలుగైదు పనులు చేసినట్టుగా, కూలీలు పనుల్లో పాల్గొన్నట్టుగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆన్‌లైన్‌లో కూలీల పేర్లు నమోదు చేశారని గ్రామస్తులు చెబుతున్నారు. పనులు, పనిచేసిన కూలీల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో ఒకే ఫొటోను రెండు, మూడు ప్రాంతాల్లో పనులు చేసినట్టుగా అప్‌లోడ్ చేయడం గమనార్హం. ఇక్కడ పనిచేసే మేట్ మచిలీపట్నంలో ఉంటున్న తన బంధువుల పేర్లను ఉపాధి పనులు చేసిన కూలీలుగా చూపడం గమనార్హం. ఈ వివరాలన్నింటినీ సేకరించిన మిగతా 6లో..

సముద్రంలోకి ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలు



అటవీశాఖ సంరక్షణలోని తాబేళ్ల హేచరీ నుంచి 300 ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను ఆదివారం సముద్రంలోకి వదిలారు. సముద్రంలో నివసించే ఈ అరుదైన తాబేళ్లు సీజన్‌లో తీరానికొచ్చి గుడ్లు పెట్టి వెళ్తుంటాయని, వాటిని అటవీశాఖ ఆధ్వర్యంలో సేకరించి 45 రోజులపాటు సంరక్షించి.. అది పొదిగి పిల్లలయ్యాక వాటిని ఇలా సముద్రంలో వదులుతామని మెరైన్ ఎస్ఐ పూర్ణ మాధురి తెలిపారు. -ఆంధ్రజ్యోతి-కోడూరు

క్షయ వ్యాధితో.. ప్రమాదమే

6లో

- నేడు ప్రపంచ క్షయ దినోత్సవం



రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు దుర్మరణం

తెలంగాణలోని దమ్మపేట వద్ద బైక్‌ను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం





అరిసేపల్లి సరస్వతి, కృష్ణ(ఫైల్)

- చెల్లెల్ని చూసేందుకు వెళ్తుండగా ఘటన
- ముష్టికుంట్లలో విషాద చాయలు

తిరువూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఖమ్మంజిల్లా దమ్మపేట వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరువూరు మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన తల్లీకొడుకు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే.. ముష్టికుంట్లకు చెందిన అరిసేపల్లి సరస్వతి(65) ఖమ్మం జిల్లా అశ్వారావుపేట సమీపంలోని మరావరిగూడెంలో ఉంటున్న తన చెల్లిని చూసేందుకు తన కుమారుడు అరిసేపల్లి కృష్ణ(45)తో కలిసి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా దమ్మపేట వద్ద గుర్తుతెలియని వాహనం వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో తల్లీకొడుకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రోడ్డు ప్రమాదంలో భర్త, అత్త మృతి చెందారన్న వార్త తెలుసుకుని కృష్ణ భార్య లలితకుమారి స్పృహతప్పి పడిపోయింది. ముష్టికుంట్ల సర్పంచ్ గొల్లమందల కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ గద్దె అనిల్ చౌదరి, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలకు అశ్వారావుపేట ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం స్వగ్రామం తరలించారు. మృతుడు కృష్ణకు ఇద్దరు సంతానం. తల్లీకొడుకుల మృతితో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి.

క్రికెట్ బెట్టింగ్‌లతో మోసపోవద్దు

- ఎస్పీ గంగాధరరావు

6లో

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ



6లో

జిల్లా గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులుగా సాంబశివరావు, శ్రీనివాసరాజు





దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వన్‌టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబాలతో తరలివచ్చారు. అమ్మవారికి తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేశారు. కొండపైన క్యూలలో కనకదుర్గమ్మ కరుణ కోరుతూ ఆర్తితో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు పొంగళ్లు సమర్పించారు. వివిధ ఆర్జిత సేవల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. క్యూలైన్లలో రద్దీని అధికారులు క్రమబద్ధీకరించారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని తాగునీరు, అన్నప్రసాదం సత్వరం అందేలా చర్యలు తీసుకున్నారు.

జిల్లా గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులుగా

సాంబశివరావు, శ్రీనివాసరాజు



గుమ్మా సాంబశివరావు



వై.శ్రీనివాసరాజు

బెంజిసర్కిల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం కృష్ణాజిల్లా శాఖ అధ్యక్షుడిగా ఆంధ్ర లయోలా కళాశాల రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ గుమ్మా సాంబశివరావు, కార్యదర్శిగా కేబీఎన్ కళాశాల గ్రంథపాలకుడు వై.శ్రీనివాసరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మైలవరం లక్కిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల లైబ్రేరియన్ టి. సాంబశివరావు, సహాయ కార్యదర్శిగా కృష్ణాజిల్లా అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శి పి.అజయ్ కుమార్‌తోపాటు మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. జిల్లాశాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం బెంజిసర్కిల్‌లోని సర్వోత్తమ భవనంలో అధ్యక్షుడు వేములపల్లి కేశవరావు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గ్రంథాలయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావి శారద పాల్గొని జిల్లాలో గ్రంథాలయం రంగ పరిస్థితులపై చర్చించారు. జిల్లాలో పౌరులతో గ్రంథపఠన అలవాటు పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రైవేట్ గ్రంథాలయాల స్థితిగతులను పరిశీలించి వాటి అభివృద్ధికి స్థానిక దాతలను ప్రోత్సహించాలని, సంఘ సభ్యులు పాఠశాలల్లో విద్యార్థులకు గ్రంథాలయాల పట్ల అవగాహన కల్పించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

క్రికెట్ బెట్టింగ్‌లతో మోసపోవద్దు



» ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : తక్కువ పెట్టుబడితో అధిక లాభం పొందవచ్చని నమ్మబలికే క్రికెట్ బెట్టింగ్‌లకు మోసపోవద్దని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు సూచించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బెట్టింగ్ యాప్‌లు మోసపూరితమైనవని, అందులో చిక్కుకుని భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. ఐపీఎల్, టి-20 మ్యాచ్‌లను ఆసరాగా చేసుకుని బెట్టింగ్ మాఫియా అమాయక ప్రజలు, యువకులను టార్గెట్ చేస్తోందన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లను కూకటివేళ్లతో పెకలించేందుకు కృష్ణాజిల్లా పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. బెట్టింగ్ యాప్‌లకు అలవాటుపడి అప్పుల ఊబిలో చిక్కుకుని ఆర్థికంగా నష్టపోయి మానసిక ఒత్తిడులకు యువత గురవుతోందని, పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు.

పథకం ప్రకారమే తిరునాళ్లలో

వైసీపీ కార్యకర్తల కవ్వింపులు : జిల్లేపల్లి

జగ్గయ్యపేట (పెనుగంచిప్రోలు), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పథకం ప్రకారమే పెనుగంచిప్రోలు తిరునాళ్లలో వైసీపీ కార్యకర్తలు అలజడి సృష్టించారని విజయవాడ పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి, గ్రామ మాజీసర్పంచ్ జిల్లేపల్లి సుధీర్‌బాబు ఆరోపించారు. ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, గ్రామంలో ఐదేళ్లుగా ప్రభలు కట్టని వైసీపీ కార్యకర్తలు ఈ ఏడాది ప్రభ కట్టటమే కాకుండా ఇష్టారాజ్యంగా డీజేలు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని, పోలీసు స్టేషన్ వద్ద టీడీపీ కార్యకర్తలపైకి వాటర్ బాటిల్స్ విసిరారని ఆరోపించారు. వీడియోలలో వాళ్ల విసిరిన రాళ్లు కానిస్టేబుళ్లకు తగిలినట్టు కనబడుతోందని చెప్పారు. గ్రామంలో వారి కుట్రలను సాగనివ్వబోమని చెప్పారు.

బైండోవర్ కేసులు పెట్టండి : ఇంటూరి రాజగోపాల్

పెనుగంచిప్రోలు తిరునాళ్ల ఘటనలో విద్యార్థులపై కేసులు నమోదు చేయటం సబబు కాదని, వైసీపీ నేత మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్ అన్నారు. విద్యార్థులపై కేసులు పెట్టి వారి జీవితాలు నాశనం చేయవద్దని వేడుకున్నారు. రెండు పక్షాలపై బైండోవర్ కేసులు పెట్టి కలెక్టర్‌కు సరెండర్ చేయాలని కోరారు.

మానసిక స్థితి సరి లేక..

కృష్ణానదిలో దూకిన యువకుడు

» ఆచూకీ కోసం ఎస్డీఆర్ఎఫ్ బృందాల గాలింపు




షేక్ సుభాని (ఫైల్‌ఫొటో)

విద్యాధరపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తల్లితో కలిసి బైక్‌పై కృష్ణలంకలో ఉన్న బంధువుల వద్దకు వెళుతున్న యువకుడు ప్రకాశం బ్యారేజి వద్దకు వచ్చే సరికి బైక్‌ను రోడ్డు పక్కన నిలిపి పరుగెత్తుకుంటూ వెళ్లి కృష్ణానదిలో దూకిన సంఘటన ఆదివారం జరిగింది. యువకుడి తల్లి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు మండలం, చినకొండూరుపాడు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌బి భర్త, ఇద్దరు కుమారులతో ఉంటున్నారు. భార్య, భర్తల మధ్య విభేదాలు రావటంతో ఆరు నెలల నుంచి ఆమె ఇద్దరు కుమారులతో కలిసి ఇబ్రహింపట్నం, వీటీపీఎస్ రోడ్డు, ఖాజీమాన్యం ఏరియాలోని ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. ఈమె పెద్ద కుమారుడు షేక్ సుభాని (20) స్నేహితుడు హుస్సేన్ బుడే ఏడాది క్రితం అనారోగ్య కారణంగా చనిపోయాడు. అప్పటి నుంచి సుభాని మతిస్థిమితం లేక పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తూ ఇంటి నుంచి బయటకు వెళ్లి ఒకటి రెండు రోజుల తరువాత వచ్చేవాడు. ఈ క్రమంలో షేక్ మస్తాన్‌బి ఆదివారం సుభానితో కలిసి ద్విచక్రవాహనంపై కృష్ణలంకలో ఉన్న సోదరి వద్దకు బయలుదేరింది. ప్రకాశం బ్యారేజీ వద్దకు వచ్చేసరికి సుభాని బైక్‌ను రోడ్డు పక్కన నిలిపి పరుగెత్తుకుంటూ వెళ్లి 63, 64 ఖానాల వద్ద పై నుంచి నదిలోకి దూకేశాడు. దీంతో ఆమె పెద్దగా కేకలు వేయగా అక్కడే ఉన్న ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా ప్రాంతానికి వెళ్లి సుభాని కోసం వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. సుభాని తల్లి మస్తాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నదిలో దూకిన సుభాని కోసం గాలిస్తున్నారు.

నేడు ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా..

క్షయ వ్యాధితో.. ప్రమాదమే



జాగ్రత్తలు తీసుకుంటే నివారణ సులభం

క్షయ(టీబీ) ప్రాణాంతకమైనా కానీ నివారణ సాధ్యమే! వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన లేక, దానిని తెలుసుకోలేక కోరి ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు. నివారణ మందులు అందుబాటులో ఉన్నా.. నిర్లక్ష్యం ప్రాణాలను కబళిస్తోంది. క్షయ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటం ద్వారా మృత్యువు నుంచి బయటపడవచ్చు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

క్షయ ప్రధానంగా ఊపిరితిత్తులను దెబ్బతీస్తుంది. అక్కడి నుంచి చర్మం, మెదడు వరకు ప్రతి భాగానికి సోకే అవకాశం ఉంటుంది. ఊపిరితిత్తులకు సోకే టీబీని పల్మనరీ టీబీ అంటారు. మెదడు, వెన్నుపూస, జీర్ణాశయం, కిడ్నీలకు సోకితే ఎక్స్‌ట్రా పల్మనరీ టీబీ అంటారు. ఊపిరితిత్తుల టీబీ గాలితో సోకుతుంది. టీబీ సోకిన వ్యక్తి దగ్గినా, తుమ్మినా, ఉమ్మినా టీబీ బ్యాసిలే అనే వైరస్ గాలిలో చేరుతుంది. ఆ గాలిని పీల్చుకోవడం ద్వారా ఇతరులు వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంది. హైరిస్క్ టీబీ బలహీన రోగనిరోధక శక్తి (వీక్ ఇమ్యూనిటీ) ఉన్న వారిలో ఉంటుంది. హెచ్‌ఐవీ, డయాబెటిక్, డయాలసిస్ రోగులు, అవయవ మార్పిడి చేసుకున్న, కేన్సర్ రోగులు, హెల్త్ కేర్ వర్కర్స్, టీబీ ఉన్న వ్యక్తులకు అతి దగ్గరగా ఉండే వాళ్లలో హైరిస్క్ టీబీ వచ్చే అవకాశం ఉంటుంది.

- ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని ప్రతి ఏడాది మార్చి 24న జరుపుకుంటారు. ఈరోజు 1882లో డాక్టర్ రాబర్ట్ కోచ్ ట్యూబర్క్యులోసిస్ (క్షయ) కారక బాక్టీరియాను కొనుగొన్నారు. క్షయ నివారణ దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా వ్యాధి గురించి అవగాహన పెంచడం, నియంత్రణ, చికిత్స విధానం ప్రజలకు తెలియ చేసే ముఖ్య ఉద్దేశంతో ప్రతి ఏటా టీబీ దినోత్సవాన్ని జరుపుకోవటం జరుగుతోంది.
- దీర్ఘకాలికంగా విపరీత దగ్గు, రాత్రి వేళల్లో జ్వరం, చెమట పోయడం, బరువుతో పాటు ఆకలి తగ్గడం, అరుదుగా రక్త వాంతులు, మందులకు స్పందించకపోవడం వంటివి కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి. వైద్యులు ఛాతీ ఎక్స్‌రే, కళ్లె పరీక్షలు చేస్తారు.
- క్షయ వ్యాధి నివారణ, చికిత్సకు పరిశోధనలు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నాయి. కొత్త మందులు, టీకాలు, చికిత్స పద్ధతుల అభివృద్ధికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. టీబీ సోకిన వారికి ఆరు నెలల చికిత్స ఉంటుంది. చికిత్స విధానం దీర్ఘకాలికంగా ఉండొచ్చు. మందులు పూర్తిగా వాడకపోయినా డ్రగ్ రెసిస్టెంట్ టీబీగా దారి తీసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వమే డాట్ ద్వారా పూర్తి వైద్య సాయం చేస్తుంది.
- 2012 కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు టీబీ అనేది నోటిఫైబుల్ వ్యాధి. ఎవరైనా టీబీ వ్యాధిగ్రస్తుడ్ని గుర్తిస్తే వారికి దగ్గర్లో ఉన్న ప్రభుత్వాసుపత్రికి రోగి యొక్క వివరాలు తెలియజేయాలి. అలా చేయకుంటే 2 నుంచి 3 ఏళ్ల పాటు రోగి రహస్యాలను దాచినందుకు గాను శిక్ష పడే అవకాశం ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. గాలి వెలుతురు ఉన్న గదిలో ఉండాలి. దగ్గినప్పుడు రుమాలు కాని, టిష్యుపేపర్ కాని, చెయ్యి కాని అడ్డు పెట్టి దగ్గాలి. జీవన శైలీ ఆరోగ్యకరంగా ఉండాలి. పోషకాహారం తీసుకోవడంతో పాటు శారీరక వ్యాయామం ఉండాలి. ఇంట్లో పిల్లలు, వృద్ధులు, గర్భవతులతో జాగ్రత్తగా ఉండాలి.

ప్రభుత్వ వైద్యశాలలు ఉత్తమం

- డాక్టర్ ప్రసన్నరాణి



ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 5వేలు మంది టీబీ రోగులున్నారు. అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో క్షయ వ్యాధికి డాట్ సెంటర్స్ ద్వారా ఉచిత వైద్య సేవలందిస్తున్నారు. అంతేకాక ఇక్కడ వైద్యం సాయం పొందే రోగులకు కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.1,000 చొప్పున నేరుగా వారి బ్యాంకుఖాతాల్లోనే సాయం జమ చేస్తున్నది.

క్రిమి ద్వారా వ్యాప్తి చెందే వ్యాధి ఇది

- డాక్టర్ సుధిన, పలమనాలజీ హెచ్‌వోడీ



ఇది అంటువ్యాధి. ఒకరి నుంచి మరొకరికి వస్తుంది. గర్భిణులకు వ్యాధిని గుర్తించి మందులు వాడితే బిడ్డకు సోకే అవకాశం ఉండదు. జీజీహెచ్‌లో ఎక్స్‌రే, సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తున్నాం.

ఆకట్టుకున్న ఉగాది కవి సమ్మేళనం

» ఆత్మీయ పురస్కారాలు ప్రదానం



ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న బుద్ధప్రసాద్, గజల్ శ్రీనివాస్ తదితరులు

విజయవాడ కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఉగాది సందర్భంగా నిర్వహించిన జాతీయ కవిసమ్మేళనం సాహిత్యాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. కవులు కోసూరి రవికుమార్, శిఖా ఆకాష్, అమూల్యా చంద్, చిట్టూరి ఆనంద రామ సుధాకర్, సరికొండ నరసింహ రాజు, మేరీ కృపారాయి, బత్తిన అగస్త్యేశ్వర రావు, గోలి మధు, గడల శివప్రసాద్ తదితరులు ఉగాది ప్రత్యేకతను ప్రతిబింబించే కవితలను వినిపించారు. గజల్ చారిటబుల్ ట్రస్ట్, సేవ్ టెంపుల్ భారత్ సంయుక్త అధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర ప్రతిభా పురస్కారాలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో ఆదివారం జరిగిన వేడుకలకు గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డుల గ్రహీత డాక్టర్ గజల్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి శాసనసభ పూర్వ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, కృష్ణామిల్క్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, సాంస్కృతిక బంధు వేముల హజరత్తయ్య గుప్తా, హలో టీవీ మేనేజింగ్ డైరక్టర్ ఉండ్రాజవరపు కిషోర్, రోటరీ పూర్వ గవర్నర్ ఎంసీ దాస్, ఈ-జోన్ సెక్యూరిటీ సొల్యూషన్స్ డైరక్టర్ చలపాటి వెంకటేశ్వరరావు, హెల్ప్ హాస్పటల్స్ సీఈవో చలపాటి జయంత్, నవ మల్లెతీగ ఎడిటర్ కలిమిశ్రీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విభిన్న రంగాల్లో విశేష సేవలందించిన ప్రతిభావంతులను ఉగాది ఆత్మీయ పురస్కారాలతో సన్మానించారు. సామాజిక సేవ - గుళ్లపల్లి నాగసాయి, శాస్త్రీయ సంగీతం - మార్టూరు హరిబాబు, చిత్రలేఖనం - పోలాకి వెంకటరమణమూర్తి, విద్యా సేవా రంగం - రేపాక రఘునందన్, సాహిత్యం - తపస్వి శ్రీ పంతుల వెంకటేశ్వరరావు, ఆధ్యాత్మిక సేవారంగం - మందలపర్తి నరసింహాచార్యులు, ప్రకృతి వైద్యసేవలు-కంబాల సుబ్రహ్మణ్య శాస్త్రి, పౌరాణిక నాటకం-షణ్ముఖి జయవిజయకుమార్ రాజు, న్యాయ సేవా రంగం - గుండపు రాజేష్ కుమార్, శాస్త్రీయ నృత్యం - డాక్టర్ భాగవంతుల సామ్య, యోగా - కొప్పుల శ్రీనివాస్‌లకు అందించారు. ముందుగా శ్రీ విష్ణు సహస్రనామ సామూహిక పారాయణం నిర్వహించారు. శాస్త్రీయ బృంద నాట్య ప్రదర్శన జరిగింది.

మస్తర్లతో మాయ!

(5వ పేజీ తరువాయి)

గ్రామస్థులు పూర్తి ఆధారాలతో అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు స్పందించలేదు.

మేట్‌కు 200, నగదు డ్రా చేసిన వారికి వంద

ఉపాధి హామీ పథకంలో తాళ్లపాలెం పంచాయతీలో వింతలు చోటు చేసుకుంటున్నాయి. మేట్ నేతృత్వంలో కూలీల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం కూలీల ఖాతాల్లో నగదు జమవుతోంది. నగదు జమ అయిన వెంటనే మేట్‌లు, గ్రామపెద్దలు వారి వద్దకు వెళ్లి రోజుకు రూ.300 చొప్పున కూలీగా జమ అయితే రూ.200 మాకు, రూ.100 మీకు అంటూ వసూలు చేసుకోవడం అలవాటుగా మారింది. కొందరు పనులు చేయకుండానే వారి ఖాతాల్లో నగదు జమ అవుతోంది. ఇలాంటి వారి వద్దకు వెళ్లి బ్యాంకులో నగదు డ్రా చేసి తీసుకురమ్మని, ఎంతో కొంత నగదు మీకు ఇస్తామని చెబుతున్నారు.

చిన్నాపురంలోనూ ఇదే తీరు

మచిలీపట్నం మండలం చిన్నాపురం పంచాయతీలోనూ ఉపాధి పథకంలో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక్కడ మహిళ పేరు మేట్‌గా నమోదై ఉంటుంది కానీ ఆమె తండ్రి అనధికార మేట్‌గా వ్యవహరిస్తూ ఉంటాడు. సదరు మహిళ వివాహం చేసుకుని ఐదు సంవత్సరాలుగా వేరే ప్రాంతంలో ఉంటోంది, అయినా ఆమె తండ్రి మేట్‌గా వ్యవహరిస్తున్నాడు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ గ్రామంలో ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలపై జనసేన నాయకులు నేరుగా ప్రభుత్వానికి 90పేజీలతో ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు పూర్తిఆధారాలతో ఫిర్యాదు అందజేశారు. హైదరాబాద్, ముంబయిలో సాఫ్ట్‌వేర్, ఇతర ఉద్యోగాలు చేస్తున్న వారి పేర్లతో ఉపాధి పనులు చేసినట్లుగా చూపి నగదు డ్రా చేశారని అన్ని వివరాలతో పలుమార్లు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఉపాధి పీడీకి ఈ అంశంపై దర్యాప్తు చేయాలని ఆదేశించారు. కంకిపాడు నుంచి వచ్చిన అధికారి సమక్షంలో విచారణ జరిగింది. లక్షలాది రూపాయల ఉపాధి నిధులు దారి మళ్లినట్లుగా అన్ని రుజువులతో ఫిర్యాదు చేసినా, విచారణ జరిగినప్పటికీ అదేమేట్‌ను ఈ గ్రామంలో ఇంకా కొనసాగించడంపై గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన వ్యక్తిని నేటికీ పనులకు రానీయడం లేదు. దీంతో మళ్లీ ఈ అంశంపై ఫిర్యాదు చేసేందుకు సంసిద్ధమవుతున్నారు.

భర్తపై కోపంతో గొంతు కోసుకుంది!

» దుండగులు ఎవరూ రాలేదని గుర్తించిన పోలీసులు

» కొండపల్లి ఘటనలో వెలుగులోకి వాస్తవాలు

విజయవాడ, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలో మహిళపై దుండగులు ఎవరూ దాడి చేయలేదని పోలీసులు గుర్తించారు. బాధితురాలే గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించినట్టు తేల్చారు. శనివారం రాత్రి అమెరికన్ ఆసుపత్రి వెనుక ఉన్న భవనం మొదటి అంతస్తులో ఉన్న మహిళ భర్త బాబ్జీ ఇంటికి వచ్చేసరికి రక్తపు మడుగులో ఉన్న విషయం తెలిసిందే. దీనిపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేశారు. రమ కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతోంది. వారి కుమార్తె లండన్‌లో భర్తతో స్థిరపడగా.. బాబ్జి కుమార్తె వద్దకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. శనివారం అతడు వీసా ఇంటర్వ్యూకు వెళ్లాడు. భార్యకు పక్షవాతం ఉండటంతో ఆమెను ఇంట్లో పెట్టి బయట తాళాలు వేసుకుని టీస్టాల్‌కు వెళ్తాడు. పడమర, దక్షిణం వైపున తలుపులకు లోపల గడియ పెట్టి ఉన్నాయి. బాబ్జీ వచ్చి తలుపు గడియ పగలగొట్టి లోపలకు వెళ్లి చూసేసరికి ఆమెకు మెడ వద్ద రక్త స్రావం అవుతోంది. భార్యాభర్తల మధ్య ఎలాంటి మనస్పర్థలు లేకపోయినప్పటికీ అతడు లండన్ వెళ్లడం రమకు ఇష్టం లేదు. తనను ఒంటరిగా వదిలేసి లండన్ వెళ్తున్నాడన్న మానసిక బాధతో ఆమె గొంతు కోసుకుందని తేల్చారు. ఈ ఘటన జరిగే సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఆ వీధిలో ఉన్న వాళ్లంతా బయట కూర్చున్నారు. చుట్టుపక్కల వారిని విచారించగా రమ ఇంట్లోకి ఎవరూ వెళ్లినట్టు గానీ, వచ్చినట్టు గానీ కనిపించలేదని వివరించారు. దుండగులు చొరబడితే పారిపోయేటప్పుడు బయట గడియ పెడతారు. లోపలి వైపు గడియి పెట్టి ఉండటంతో పోలీసులు మరో కోణంలో దర్యాప్తు చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

బెజవాడ డెవలపర్‌కు అరుదైన గౌరవం

» క్రెడాయ్ ఏపీ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నిక



దాసరి రాంబాబు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడకు చెందిన దాసరి రాంబాబు కాన్ఫడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. రాజమండ్రిలో జరిగిన క్రెడాయ్ మేనేజింగ్ కమిటీ ఎన్నికలలో ఈ మేరకు దాసరి రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దాసరి రాంబాబు పీవీఆర్ గ్రూప్‌కు మేనేజింగ్ పార్టనర్‌గా ఉన్నారు. విజయవాడ క్రెడాయ్ చాప్టర్ ఈసీ మెంబర్‌గా కూడా గతంలో ఆరు సంవత్సరాలు పనిచేశారు. ఆ తర్వాత జాయింట్ సెక్రటరీగా 2 సంవత్సరాలు, కోశాధికారిగా 4 సంవత్సరాలు, ప్రధాన కార్యదర్శిగా 2 సంవత్సరాలు, క్రెడాయ్ ఏపీ కోశాధికారిగా 2 సంవత్సరాలు, క్రెడాయ్ విజయవాడ అధ్యక్షులుగా 2 సంవత్సరాల పాటు ఆయన పనిచేశారు.

బుడమేరులో మట్టి దందా!

(5వ పేజీ తరువాయి)

వ్యవహరిస్తున్నారు. మట్టి తరలిస్తున్నట్లు కిందస్థాయి సిబ్బంది నుంచి తమకు ఎటువంటి సమాచారం లేదని అధికారులు పేర్కొనడం గమనార్హం.

అనుమతులకు అర్జీ పెట్టుకున్నారు - గణపతి, డీఈ, డ్రెయినేజీ శాఖ

ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైం(ఇ.వో.టి) కోసం కాంట్రాక్టర్ అర్జీ పెట్టుకున్నారు. డ్రైనేజీ చీఫ్ ఇంజినీర్ వద్ద పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం ఎటువంటి గడువును పెంచలేదు. మట్టి బయట ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలియడంతో పనులను నిలుపుదల చేశాం.

మట్టి తరలింపును అడ్డుకున్నాం - యార్లగడ్డ రవి, పాములపాడు డీసీ చైర్మన్

బుడమేరు నుంచి అక్రమంగా మట్టిని ఉంగుటూరు, గన్నవరంలోని ప్రైవేట్ స్థలాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తుల నుంచి ఫిర్యాదు అందింది. వెంటనే డ్రైనేజీ అధికారులకు సమాచారమిచ్చి మట్టి తరలింపును అడ్డుకున్నాం.

లైన్ క్లియర్!

(5వ పేజీ తరువాయి)

అందుబాటులోకి తీసుకురావచ్చు.

తొలగించే ల్యాంకో లైన్ అలైన్‌మెంట్ మార్చాల్సిన అవసరం ఎందుకు?

ల్యాంకో పవర్ ప్రాజెక్టు మూత పడిన తర్వాత దాని ట్రాన్స్‌మిషన్ లైన్‌ను కొనుగోలు చేసిన మయన్మార్ కంపెనీ ఆ లైన్‌ను పూర్తిగా తొలగించి స్క్రాప్ నంతటినీ తమ దేశం తీసుకువెళతామని స్పష్టంగా చెబుతుంటే .. ఇక ల్యాంకో అలైన్‌మెంట్ మార్చాల్సిన అవసరం ఎంతమాత్రం లేదన్నది అర్థమవుతోంది. కానీ, ఎన్‌హెచ్ అధికారులు కొండపల్లి పవర్ ప్లాంట్‌లో మరో యూనిట్‌ను కొన్న రాధా సంస్థతో ట్రాన్స్‌మిషన్ లైన్ అలైన్‌మెంట్ మార్పుతో రైతులను ఇబ్బందులు పెట్టడం ఎందుకో అర్థం కాకుండా ఉంది. ఇదే సందర్భంలో తొలగించే లైన్‌కు విద్యుత్ సరఫరా అంతరాయం కోసం 25 రోజుల సమయం కోరటం ఏమిటో కూడా అంతు చిక్కకుండా ఉంది.

- యజమాని కాకపోయినా.. అక్టోబరు వరకు సమయం కోరటం ఏమిటి?

ఈ మొత్తం వ్యవహారంలో ట్రాన్స్‌మిషన్ లైన్‌కు తనకు ఎలాంటి సంబంధం లేకపోయినా రాధా సంస్థ అక్టోబరు వరకు విద్యుత్ అంతరాయానికి అవకాశం లేదని ఎన్‌హెచ్ అధికారులకు లేఖ రాయటం మరీ విడ్డూరంగా ఉంది. ల్యాంకో లిక్విడేటర్ కోర్టుకు సమర్పించిన వివరాల ప్రకారం పవర్ ప్లాంట్‌లో ఒక యూనిట్‌ను మాత్రం రాధా సంస్థకు స్క్రాప్‌కు విక్రయించామని పేర్కొనటం జరిగింది. ట్రాన్స్‌మిషన్ లైన్‌ను మయన్మార్ కంపెనీకి విక్రయించామని కూడా చెప్పింది. మరి ఇలాంటపుడు ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ విద్యుత్ లైన్‌తో రాధాకు ఎలాంటి సంబంధం లేదన్నది అర్థమవుతోంది. ఎన్‌హెచ్ అధికారులు రాసిన లేఖకు జవాబుగా తమకు ఈవిద్యుత్ లైన్‌తో సంబంధం లేదని చెప్పాల్సిన రాధా సంస్థ ఏ విధంగా అక్టోబరు సమయం కోరిందన్నది అంతుచిక్కని మిస్టరీగా ఉంది.

ఎన్‌హెచ్ అధికారులు ఎందుకు సమస్యను వివాదాస్పదం చేస్తున్నారు?

కొండపల్లి ల్యాంకో పవర్ ప్లాంట్ మూతపడక ముందు ఆ సంస్థతో మాత్రమే ఎన్‌హెచ్ అధికారులు ఒప్పందం చేసుకున్నారు. వెస్ట్ బైపాస్ రోడ్డు పనుల ప్రారంభ దశలో కొండపల్లి పవర్ ప్లాంట్ మూత పడింది. మరోవైపు వెస్ట్ బైపాస్ రోడ్డు పనులు పురోగతికి చేరుకున్నాయి. ఇలాంటి దశలో ల్యాంకో సంస్థ మూతపడింది కాబట్టి ఎన్‌హెచ్ అధికారులు .. ఏం చేయాలన్నది ఆలోచించాలి. ల్యాంకో పవర్ ప్లాంట్ మూతపడటంతో.. అప్పుల వాళ్లకు డబ్బులు చెల్లించటానికి దీనిని విక్రయించి తీర్చమని ఎన్‌సీఎల్‌టీ ఒక లిక్విడేటర్‌ను నియమించింది. ఇలాంటపుడు లిక్విడేటర్ చెప్పినట్టుగా నడుచుకోవాల్సిన ఎన్‌హెచ్ అధికారులు.. ఒక యూనిట్‌ను స్క్రాప్ కింద కొనుగోలు చేసిన రాధా సంస్థను ట్రాన్స్‌మిషన్ లైన్‌కు యజమానిగా గుర్తించటం అనేక అనుమానాలకు తావిస్తోంది. కేంద్ర ప్రభుత్వంపై వందల కోట్ల రూపాయల భారం మోపేలా అలైన్‌మెంట్ పేరుతో ఈ డ్రామా ఆడటం ఎందుకో అంతుచిక్కకుండా ఉంది.

భూ కబ్జాలు..

(5వ పేజీ తరువాయి)

తెలిసింది. పార్టీ పెద్దలు కూడా అతనితో గొడవ పెట్టుకొనేందుకు వెనుకాడినట్లు సమాచారం.

పోలీసులకు బాధితుల ఫిర్యాదు

ఈ క్రమంలో రమేష్ అకృత్యాలు తట్టుకోలేక బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయనపై ఆరు కేసులు నమోదయ్యాయి. దౌర్జన్యాలు, బెదిరింపులపై నాలుగు కేసులు, రెండు బైండవర్ కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో 2019 ఎన్నికల సమయంలో టీడీపీని వీడిన రమేష్ వైసీపీలో చేరాడు. వైసీపీ విజయం కోసం గట్టిగా పని చేసిన రమేష్‌కు వైసీపీలోనూ అగ్రస్థానం లభించింది. ఆయన సతీమణి ప్రశాంతిని జడ్పీటీసీగా నిలబెట్టి గెలిపించారు. 2014 నుంచి 2019 వరకూ సాగించిన హవాకు కొనసాగింపుగా బెదిరింపులు, సెటిల్‌మెంట్‌లకు తెగబడినట్లు సమాచారం. వైసీపీ ఐదేళ్ల పాలనలో సైతం తన అకృత్యాలతో కోట్లాది రూపాయలు సంపాదించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటికి తోడు కోడిపందేలు, పేకాట, గ్యాంబ్లింగ్ వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తూ తన అవినీతి సామ్రాజ్యాన్ని విస్తరించినట్లు సమాచారం. నాటి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల అండదండలు ఉండటంతో బెదిరింపులకు గురైన బాధితులు కేసులు కూడా పెట్టలేని స్థితికి చేరుకున్నారు. ఒకరిద్దరు ధైర్యం చేసినా పోలీసులు కేసులు నమోదు చేయలేదు.

స్థలం కొనిస్తానని రూ.22 లక్షలు స్వాహా

2024 ఎన్నికలకు ముందు తన గ్రామానికి చెందిన అంగిరేకుల రాంబాబు అనే వ్యక్తికి స్థలం కొనిపెడతానని చెప్పి రూ.22 లక్షల నగదు తీసుకున్న వేల్పుల స్థలం కొని పెట్టకపోగా, ఆ సొమ్ము తిరిగి ఇవ్వలేదని సమాచారం. బాధితుడు పలు మార్లు తన డబ్బులు ఇవ్వాలని కోరగా, వేల్పుల తన అనుచరులతో బెదిరింపులకు దిగినట్లు తెలిసింది. ఇటీవల ఆయన నేరుగా బాధితుడి ఇంటికే వెళ్లి బెదిరించినట్లు సమాచారం.

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా..

2024 ఎన్నికల సమయంలోనూ అనేక అక్రమాలకు పాల్పడినట్టు తెలిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసీపీ గూండాలు, కబ్జాకోరులు సైలెంట్ అయ్యారు. కొందరైతే ఊళ్లు సైతం వదలి వెళ్లిపోయారు. వేల్పుల మాత్రం అదే ఊపును కొనసాగిస్తున్నారు. టీడీపీ ముఖ్యనేతలతో ఉన్న పాత పరిచయాల వల్లనో తన అకృత్యాలకు విరామం కూడా ఇవ్వడంలేదని తెలిసింది.

అధికార పార్టీ నాయకులపై దాడికి యత్నం

ఇటీవల మునేటి వరదల కారణంగా నిరాశ్రయులైన వారిని కంచికచర్ల క్లబ్‌లో ఉంచారు. వారికి ప్రభుత్వం ద్వారా ఆహారం అందించారు. బాధితులను కలిసేందుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా టీడీపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. అందుకు ప్రతిగా అధికారపార్టీ నాయకులపై దాడులు చేసేందుకు వేల్పుల కర్రలు, రాళ్లతో క్లబ్ వద్దకు చేరుకోవడంతో పోలీసులు అప్రమత్తమై వారిని వెనక్కు పంపారు. అధికారం ఉన్న కూటమి నాయకులు అతనికి ఎదురు వెళ్లలేకపోయారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పంపిణీ సమయంలో కూడా వేల్పుల దౌర్జన్యంగా ట్రాక్టర్లకు ఇసుకను లోడ్ చేయించుకొన్నట్లుసమాచారం. ప్రతి లారీకి తమకు సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేసి మరీ నగదు దండుకున్నట్టు తెలిసింది. మొత్తం మీద వేల్పుల అకృత్యాలు ఇంకెంత కాలం ప్రజలు భరించాల్సి ఉందో వేచి చూడాలి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

ఎస్సీ వర్గీకరణతో అందరికీ సమాన అవకాశాలు : గండేపూడి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ వల్ల ఎవరూ నష్టపోరని, ఎవరికీ వ్యతిరేకం కాదని అందరికీ సమానావకాశాలు కల్పించేందుకు దశాబ్ధాలుగా చేస్తున్న పోరాట ఫలితమే వర్గీకరణ అని తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి గండేపూడి నిలీష్‌కుమార్ అన్నారు. తిప్పనగుంటలో ఆదివారం ఎంఆర్‌పీఎస్ విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. బాబూజగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎం చంద్రబాబునాయుడు, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేశ్ మాట్లాడుతూ, వెనుకబడిన వారికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు ముదునూరి కొండలరావు, మద్దాల రంగారావు, అభిలాష్, మురళి, ప్రవీణ్, సంపత్, చిట్టిబాబు, సాయిల పణీంద్ర, బాణాల రాజేష్ పాల్గొన్నారు.

రాణమ్మతల్లి తిరునాళ్ల 30న

హనుమాన్‌జంక్షన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూజివీడు రోడ్డులోని ప్రమీల రాణమ్మ తల్లి ఆలయంలో ఈ నెల 30 ఉగాది పర్వదినం పురస్కరించుకొని తిరునాళ్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకుడు అన్నే రాంబాబు తెలిపారు. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సంతో పాటు నిప్పులగుండం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అన్నసంతర్పణ ఉంటుందని తెలిపారు.

మానవత ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పేదవారికి సాయం అందించడానికి మానవత సంస్థ ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. అప్పనవీడు పంచాయతీలో స్వీపరుగా పనిచేస్తున్న తడికిమల్ల వెంకన్న ఇటీవల గుండెకు స్టెంట్ వేయించుకున్నాడు. ఆదివారం వైద్యఖర్చులు నిమిత్తం మానవత రూ.5వేలు ఆర్థికసాయం అందజేసింది. ఈ కార్యక్రమంలో మానవత జంక్షన్ శాఖ నిర్వాహకులు వడ్డి రాజేశ్వరరావు, పీవీఎస్ చలం, కొట్నాని రామచంద్రరావు, చెక్కా సుబ్బారావు, ఇందిరాదేవి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెనమలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పోరంకిలోని ఒక అపార్టుమెంటులో పేకాడుతున్న ఎనిమిది మందిని ఎస్ఐ ఉషారాణి నేతృత్వంలోని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద నుంచి రు.21, 980లను స్వాధీనం చేసుకొన్నారు. పేకాట, కోడిపందేల నిర్వాహకులపై ఉక్కుపాదం మోపుతామని సీఐ వెంకటరమణ హెచ్చరించారు.

టీడీపీ సీనియర్ నాయకుడు ఎం ఆంజనేయులు మృతి



ఆంజనేయులు (ఫైల్)

గోసాల (కంకిపాడు), మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు మండల గోసాల గ్రామానికి చెందిన ఎం. ఆంజనేయులు ఆదివారం బ్రేయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి మండలంలో పార్టీ బలోపేతానికి ఆయన విశేషంగా కృషి చేశారు. ఆంజనేయులు మృతి వార్త తెలుసుకున్న సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు గొంది శివరామకృష్ణ ప్రసాద్, అను మోలు ప్రభాకర్, కోయా ఆనంద్ ప్రసాద్, యనమదల వెంకటేశ్వరరావు, మన్నే వాసు తదితరులు ఆంజనేయులు మృతదేహాన్ని సందర్శించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆంజనేయులు కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

పేదలకు దుస్తులు, అల్పాహారం పంపిణీ

ఉయ్యూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవా కార్యక్రమాల్లో ఇన్నర్‌వీల్ క్లబ్ ముందంజలో ఉంటుందని క్లబ్ అధ్యక్షురాలు నర్రా సుధారాణి అన్నారు. క్లబ్ సభ్యురాలు బోరుకాటి శ్యామల సహకారంతో గురజాడ డొంకలో నివసిస్తున్న పేదలకు దుస్తులు, అల్పాహారం ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చిత్తుకాగితాలు ఏరుకుని జీవనం సాగిస్తున్న గిరిజన కుటుంబాల వారికి తోచిన విధంగా సాయం అందించాలన్న ఉద్ధేశంతో శ్యామల ఆధ్వర్యంలో దుస్తులు, అల్పాహారం అందిచడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు.

లక్ష్మీతిరుపతమ్మ దేవస్థానానికి విరాళాలు అందజేత

గన్నవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పాత గన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ దేవస్థానం కల్యాణ వేదిక నిర్మాణానికి పలువురు విరాళాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు ఆదివారం అందజేశారు. పట్టణానికి చెందిన ఆళ్ల హేమచంద్ర ముఖర్జీ, రమాచౌదరి దంపతులు రూ.50,116 విజయవాడకు చెందిన కొసరాజు వెంకటేశ్వరరావు, ఉమాచౌదరి దంపతులు రూ.50,116 హైదరాబాద్‌కు చెందిన దుగ్గిరాల మాదవ రమేష్, లక్ష్మీచౌదరి దంపతులు రూ.50,116 పునాదిపాడుకు చెందిన రమణవరపు బేబి సరోజిని జ్ఞాపకార్థం ఆమె భర్త పూర్ణచంద్రరావు రూ.50వేలు విరాళాన్ని అందజేశారు.

తక్కువ వడ్డీకి లోన్ ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

ఉయ్యూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తక్కువ వడ్డీకి ముత్తూట్ ఫైనాన్స్ నుంచి హౌసింగ్ లోన్ ఇప్పిస్తానని నమ్మించి ప్రాసెసింగ్ చార్జీగా దప దపాలుగా రూ. 31వేలు తీసుకుని మోసం చేసిన ముత్తూట్ ఫైనాన్స్‌కు చెందిన సిరాజ్‌పై ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఉయ్యూరు పట్టణ సీఐ రామారావు తెలిపారు. స్థానిక తాతయ్య బజార్‌లో ఇల్లు కొనుగోలు చేసేందుకు షేక్ బాషా ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ నుంచి లోన్ తీసుకుని ఈఎంఐలు కడుతుండగా ముత్తూట్ ఫైనాన్స్‌కు చెందిన సిరాజ్ తమ సంస్థ నుంచి 12 శాతం వడ్డీకి లోన్ ఇప్పిస్తానని ప్రాసెసింగ్ చార్జ్‌గా డబ్బుతీసుకుని 17.5 శాతం వడ్డీకి రూ. 26లక్షలు మంజూరు చేయించి మోసం చేసినట్టు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

చివరికీ నీరందించండి

- మధిర బ్రాంచి కాలువలో నీటి విడుదలను పరిశీలించిన ప్రాజెక్టు కమిటీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ ఎడమకాలువ 3వ జోన్ పరిధిలో సుమారు 2.36లక్షల ఎకరాలకు సాగునీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారని, తక్షణం నీటిని విడుదల చేసి పంటలను రక్షించాలని ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ కోరారు. ఎన్టీఆర్ జిల్లాలోని చింతలనర్వ వద్ద మధిర బ్రాంచ్ కాలువ లో నీటి విడుదలను ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రంగన్నగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, నాగార్జునసాగర్ ఎడమకాలువ పరిధిలో 3.62 ఎకరాల ఆయుకట్టుకగాను 32టీఎంసీల వాటా ఉందని, కానీ తెలంగాణా ప్రభుత్వం ఇప్పటి వరకూ 19టీఎంసీల నీటిని మాత్రమే విడుదల చేసిందన్నారు. ఎడమకాలువ పరిధిలోని 2వజోన్‌కు పూర్తిస్థాయిలో సాగునీరందినప్పటికీ 3వజోన్‌లోని చివరిప్రాంతాలకు నీరందట్లేదని తెలిపారు. ఈజోన్ పరిధిలో తిరువూరు, నూజివీడు, మైలవరం, గన్నవరం, నందిగామ నియోజకవర్గాల్లోని 2.36లక్షల ఎకరాల్లో సాగుచేసిన పంటలకు తీవ్ర నీటి ఎద్దడి ఉందని, తెలంగాణా ప్రభుత్వం మానవతా దృక్పధంతో సాగర్‌నీటిని విడుదల చేయాలని కోరారు. ప్రసుత్తం విడుదల చేస్తున్న నీటిని 1500క్యూసెక్కులకు పెంచి నిరాటంకంగా 15రోజుల పాటు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కేఆర్ఎంబీ ఉత్తర్వులను దృష్టిలో పెట్టుకుని ఆరుతడి పంటలను రక్షించేలా సాగునీరు చివరి ప్రాంతాలకు అందేలా సహకరించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక డీసీ కానూరి హనుమంతరావు, ఎన్టీఆర్‌జిల్లాకు చెందిన డీసీలు గంధ్రప్రసాద్, కటారి కోటేశ్వరరావు, కృష్ణాజిల్లాకు చెందిన డీసీ దేవినేని సత్యనారాయణ, ఏలూరు జిల్లాకు చెందిన డీసీ రావర్ల బాలకృష్ణ, ఎనెస్సీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రామదాసు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేష్, సునీత, ప్రసన్నకుమార్, నీటి సంఘ అధ్యక్షులు కావూరి శ్రీనివాసరావు, ఆయుకట్టు ప్రముఖులు తాళ్లూరి నాగేశ్వరరావు, దిరిశాల వెంకటకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.



2వ జోన్‌లోని మధిర బ్రాంచ్ కెనాల్ వద్ద సాగర్ జలాలను పరిశీలిస్తున్న ఎన్ఎస్‌పీ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ తదితరులు



ఉంగుటూరు పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై యు.గోవిందు

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

ఉంగుటూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్లు తమకున్న చెడు అలవాట్లను వదిలేసి, సత్ప్రవర్తనతో మెలగుతూ, సమాజంలో శాంతియుతంగా జీవించాలని ఉంగుటూరు ఎస్సై యు.గోవిందు సూచించారు. స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వున్న రౌడీషీటర్లను ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, రౌడీషీటర్లు, చెడుప్రవర్తన కల్గిన వారి కదలికలపై ఎల్లప్పుడూ పోలీస్ నిఘా ఉంటుందన్నారు. గతంలో చేసిన తప్పులు మళ్లీ చేయకుండా గొడవలు, వివాదాలకు దూరంగా వుండాలని హితవు పలికారు. గ్రామాల్లో అల్లర్లకు, ఘర్షణలకు దిగుతూ, ప్రజాశాంతికి విఘాతం కలిగించే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.



తాడిగడపలో జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ముస్లింలు అన్ని రంగాల్లో రాణించాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వానికి గత ఎన్నికల్లో మద్దతుగా నిలిచిన ముస్లింలు అవకాశాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆకాంక్షించారు. ఆదివారం తాడిగడపలోని మసీదులో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఆయన హాజరై ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, తుమ్మల రాంకుమార్, నాగుల్‌మీరా, జానీ, బేగ్, వలి, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : స్థానిక ఫెరీ మసీదులో ఆదివారం ముస్లింలకు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఉయ్యూరు నగరపంచాయతీ కోఆప్షన్ సభ్యుడు ఖలీల్ పాల్గొన్నారు. రంజాన్ మాసం పురస్కరించుకుని ఉపావాస దీక్షలో ఉన్న ముస్లింలకు దీక్ష ముగిసిన తరువాత మసీదులో ఇఫ్తార్ విందు ఇచ్చారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తార్, కలామ్, జలీల్ తదితరులు పాల్గొని సేవలందించారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

ఉయ్యూరు : సామాజిక సేవా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ముందంజలో ఉండాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. చినఓగిరాల సులాభి వద్ద మండల పార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల వెంకట కుటుంబరావు, మండల యువత నాయకుడు తుమ్మల హరీశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవిలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసి తాగు నీరు, మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కుటుంబరావు, తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి, ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ జయదేవ్, జబర్లపూడి సర్పంచ్ నూరపనేని శేషవరప్రసాద్, కొండా ప్రవీణ్, మాజీ సర్పంచ్ పాలడుగు రామకృష్ణ, మల్లికా ర్జునరావు, యార్లగడ్డ సాయి, కోటేశ్వరరావు గ్రామ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణ, కొండలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

ఉంగుటూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలంలో వృద్ధులు ఎండవేడిమికి గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు మజ్జిగ, చెరుకురసం, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తరచుగా సేవించాలని మన సేవక్ ఫౌండేషన్ (గన్నవరం) ప్రతినిథులు తెలిపారు. ఆదివారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని తుట్టగుంట, వెన్నూతల గ్రామాల్లో 160మంది వృద్ధులకు ఓఆర్ఎస్ డింక్ ప్యాకెట్లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిథులు మామిళ్లపల్లి నాగసుబ్బారావు, చాగంటిపాటి రమేష్‌బాబు, దండుబోయిన నాగలక్ష్మి, చాగంటిపాటి లక్ష్మీసుకన్య పాల్గొన్నారు.

సబ్ జైల్‌లో సదుపాయాలపై జిల్లా జడ్జి ఆరా

కోర్టు సమస్యలను పరిష్కరించాలని బార్ అసోసియేషన్ వినతి

గన్నవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎ.అరుణ సారిక, కార్యదర్శి కేవి కృష్ణయ్య, స్థానిక సబ్ జైల్‌ను ఆదివారం పరిశీలించారు. సబ్ జైల్‌లోని రికార్డులు పరిశీలించి ఎంత మంది ఖైదీలు ఉన్నారు, వారి నేరచరిత్ర తెలుసుకున్నారు. ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను, సదుపాయాలపై ఆరా తీశారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.జయ లక్ష్మి, అడిషనల్ సివిల్ కోర్టు జడ్జి బి.శిరీషా, జైల్ సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ●గన్నవరం కోర్టుల సమస్యలను పరిష్కరించాలని జిల్లాజడ్జి ఎ.అరుణ సారికకు బార్ అసోసియేషన్ సభ్యులు విన్నవించారు. ఆదివారం గన్నవరం వచ్చిన జిల్లా జడ్జి అరుణ సారికను అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో దుశ్శాలు వాలతో సత్కరించారు. సమస్యలపై సానుకూలత స్పందించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి రవికుమార్ తెలిపారు. ఉపాధ్యక్షుడు ఎల్ వేణుబాబు, కార్యదర్శి ఆర్.ప్రకాశరావు కోశాధికారి విమల్‌కుమార్, ఎల్.భగీరధి, సీతారామయ్య, వైఆర్ శారదా, జీఎస్ఆర్ మూర్తి, కెవి రమణ, ఎస్టీజీ నీరజ, ఎ.సోమేశ్వరరావు, ఎన్.రమేష్, శ్రీనివాసరావు, వీరబాబు, కెవి ప్రసాద్ పాల్గొన్నారు.



జిల్లా జడ్జి అరుణ సారికను సత్కరిస్తున్న గన్నవరం బార్ అసోసియేషన్ సభ్యులు

జానకీశర్మకు జ్యోతిష్యరత్న అవార్డు



జానకీరామశర్మకు అవార్డును అందజేస్తున్న ఐకాన్ సంస్థ చైర్మన్ జొన్నలగడ్డ శ్రీనివాసరావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : వేదాధ్యయన విద్యను ప్రజలకు అందిస్తూ సామాన్యులకు చేరువ య్యేలా కృషి చేస్తున్నందున జానకీరామ శర్మకు జ్యోతిష్యరత్న అవార్డును శ్రీవిశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ, సికింద్రాబాద్ అందజేసింది. విజయవాడలో శ్రీవిశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్ర మంలో విశాఖపట్నం, ఐకాన్ సంస్థ చైర్మన్ జొన్నలగడ్డ శ్రీనివాసరావు ఈ అవార్డును రామశర్మకు అందజేశారు. శ్రీవిశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ ప్రతి ఏటా ప్రకటించే జ్యోతిష్య రత్న అవార్డుకు పల్లెర్లమూడిలోని శ్రీకాశీవిశాలక్షి సమేత విశ్వనాధస్వామి ఆలయ ప్రధాన అర్చకులుగా పనిచేస్తున్న జానకీ రామశర్మకు ఈ సంవత్సరం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జానకీ రామ శర్మకు అవార్డు రావడం పట్ల స్థానిక ప్రముఖులు శ్రీనివాసరావు, వెంకటరావు, సిద్ధయ్య తదితరులతో పాటు పలు బ్రాహ్మణ సంఘాల సభ్యులు అభినందనలు తెలిపారు.

భగత్‌సింగ్ ఆశయాల బాటలో యువత నడవాలి



యనమలకుదురు భగత్‌సింగ్ నగర్ సెంటరులో..

గన్నవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ ఆశయాల బాటలో యువత నడవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న పిలుపునిచ్చారు. మండలంలోని సూరంపల్లిలో ఆదివారం భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు కె.వెంకటేశ్వరరావు, ఎం.ఆంజనేయులు, కె.ఏసుదాసు, రాంబాబు, రమేష్, సాంబశివరావు, నాగేశ్వరరావు, రామకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు. ● స్థానిక సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ ఏరియా కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, రామకృష్ణ, రవి, సతీష్, రాఘవేంద్ర, ప్రవీణ్, నాగరాజు పాల్గొన్నారు.


కంకిపాడు : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉప్పలూరులో ఆదివారం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న నాయకులు నాగరాజు, ఆంజనేయులు, డి. బన్నీ, కె. చిరంజీవి, టి. అశోక్, డి. చందు, రంగారావు, నరేష్, ఎం. చంటిబాబు సీహెచ్ శ్రీహరి పాల్గొన్నారు. **పెనమలూరు :** పెనమలూరు, కానూరు, పోరంకి తదితర ప్రాంతాల్లో భగత్‌సింగ్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యనమలకుదురు భగత్‌సింగ్ నగర్ సెంటరులో ఎస్ఎఫ్ఐ నాయకులు క్రాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు షేక్ ఇబ్రహీం భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి కార్యదర్శి ఖాసీ, తులసీరాం, పవన్‌కుమార్, అశోక్, హేమంత్‌కుమార్, మస్తాన్ మౌలాలి, నిఖిల్, బాబు, శ్రీరాములు, విశ్వపతి తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : భగత్‌సింగ్ వర్ధంతిని ఆదివారం మండలంలోని తేలప్రోలు, తరిగొప్పల, ఎలుకపాడు, వెన్నూతల, ఉంగుటూరు, పెదఅవుటపల్లి గ్రామాల్లో పార్టీ నేతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు టీవీ రామ్మోహనరావు, మాగంటి సాంబశివరావు, చౌటుపల్లి ప్రభాకర్, అబ్రహం, శేఖర్, వెంకటేశ్వరరావు, సుందరయ్య పాల్గొన్నారు.

ఇబ్బందుల్లో ఉన్న వారికి అండగా టీడీపీ

టీడీపీ యువ నాయకులు బోడె వెంకట్రామ్, రెహమాన్

పెనమలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడుతున్న వారికి టీడీపీ కొండంత అండగా ఉంటుందని టీడీపీ యువనాయకులు బోడె వెంకట్రామ్, రెహమాన్ పేర్కొన్నారు. ఆదివారం కానూరు సనత్ నగర్‌లో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, తోపుడుబళ్ల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందూ...తర్వాతా తాము ప్రజలకు అందుబాటులో ఉండి వారి అవసరాలు తీర్చడంలో ముందండేవాళ్లమని తెలిపారు. టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బుజ్జిలు మాట్లాడుతూ, దాతృత్వంలో యువత బోడె వెంకట్రామ్, రెహమాన్‌లను ఆదర్శంగా తీసుకొని ప్రజాసేవలో పాలుపంచుకోవాలని, పేదలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో రియాజ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ట్రైసైకిల్స్‌ను పంపిణీ చేస్తున్న టీడీపీ యువ నాయకులు బోడె వెంకట్రామ్, రెహమాన్



ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి సన్మానం

గుడివాడ రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామంలో తాగు నీరు అందించటానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు నిబద్ధతతో అహర్నిశలు కష్టపడ్డారని ఎంపీపీ గద్దె పుష్పరాణి కొనియాడారు. ఆదివారం తాళ్లూరి కల్యాణ మండపంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఆత్మీయులు, అధికారులు, నాయకులు ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ అధికారులు, ప్రజల మన్ననలు పొందిన అట్లూరికి పదవీ విరమణ చేసిన తర్వాత ప్రశాంత జీవితం గడపాలన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, గుడివాడ నియోజకవర్గ అధికారులు, ప్రజలు ఘనంగా సత్కరించారు.



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న పుష్పరాణి

ఆక్రమణల తొలగింపునకు చర్యలు : కొండవీటి

కూచిపూడి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి బస్టాండ్ చుట్టూ ఉన్న ఆక్రమణల తొలగింపునకు ఉన్నతస్థాయి అధికారులు స్పందించి హైకోర్టు ఆదేశాల అమలుకు కృషి చేయాలని కూచిపూడి సర్పంచ్ కొండవీటి విజయలక్ష్మి పేర్కొన్నారు. "ఆక్రమణల తొలగింపులో జాప్యమేల...హైకోర్టు ఆదేశాలు బేఖాతరు చేస్తున్న అధికారులు" శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. గ్రామపంచాయతీ అధికారులు సోమవారం ఆక్రమణదారులకు నోటీసులు అందిస్తారన్నారు. దుకాణాలు కూల్చివేయటానికి నిబంధనల ప్రకారం ముందుకు వెళ్తామని, దీనికి ఉన్నత స్థాయి అధికారులు స్పందించాలన్నారు.



కొండవీటి విజయలక్ష్మి

వృద్ధులకు భోజనం పంపిణీ

గుడివాడ : చిన్నారి లిషిత పుట్టినరోజు వేడుకలను వృద్ధుల మధ్య జరుపుకోవడం అభినందనీయమని బీజేపీ టూటౌన్ అధ్యక్షులు మాచర్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం చిన్నారి కుంభం లిషిత జన్మదినం సందర్భంగా స్థానిక మందపాడులోని నిరాశ్రయుల కేంద్రంలో వృద్ధులకు భోజన వసతి కల్పించారు. లంకా రాంబాబు, చరణ్, రామ్మోహనరావు, అయ్యప్ప పాల్గొన్నారు.



గుడివాడలో సమస్యలు తెలుసుకుంటున్న వెనిగండ్ల



గుడ్లవల్లేరులో వీధులను శుభ్రం చేస్తున్న వెనిగండ్ల



పామర్రులో అర్జీలు స్వీకరిస్తున్న కుమార్‌రాజా

సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను నేరుగా కలిసి తెలుసుకునేందుకే ప్రజావేదిక కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు 24వ వార్డులో ప్రజావేదిక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల పాల్గొని ప్రజల నుంచి అర్జీలను తీసుకుని వారి సమస్యలను సావధానంగా తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూటమి నేతలు రాంబాబు, సాంబశివరావు, మణికంఠ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు, కౌతవరం గ్రామ పంచాయతీల్లో ఆదివారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుడ్లవల్లేరు మండలానికి ఇప్పటికి దాదాపు 22 కోట్లతో అంతర్గత రహదారులు నిర్మాణం చేశామని, రూ 3 కోట్లతో ఫిల్టర్ బెడ్‌లు మరమ్మతులు చేశామని వివరించారు. సోలార్ కోసం సబ్సిడీ రణాలు, కార్పొరేషన్ రుణాలు, వ్యవసాయ యాంత్ర పరికరాలకు సబ్సిడీ రుణాలు , ఇలా పలు పథకాల గురించి ఆయన వివరించారు. కౌతవరం యానాది కాలనీలో డస్ట్‌బిన్లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో తాగునీటి పథకం ఫెన్సింగ్ పనులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ముడా ఛైర్మన్ మట్టా ప్రసాద్‌లు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమాల్లో జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘ డైరెక్టర్ వి.వి.కే.బి సుబ్బారావు, డీసీ ఛైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి, నానాజీ, శివరాజేష్, నాగలక్ష్మి, తూము పద్మజ, నాగేశ్వరరావు, రామరాజు, గోవాడ శివ, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు దిలీప్ కుమార్, యుగంధర్, కౌతవరం పంచాయతీ సెక్రటరీ జయలక్ష్మి, వీఆర్‌వోలు వెంకన్న, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర విజయవంతం కావాలంటే ప్రజలు భాగస్వాములు కావాలనీ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం గుడ్లవల్లేరులో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పారిశుధ్య కార్మికులతో కలసి వీధులను చీపురుపట్టి శుభ్రం చేశారు. అనంతరం వీధివీధికి, ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్తలను ఏవిధంగా పారిశుధ్య కార్మికులు వచ్చినపుడు ఇవ్వాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారికి మూడు రకాల డస్ట్‌బిన్లను ఉచితంగా అందజేశారు. అనంతరం గ్రామస్థులు, అధికారులచే ప్రతిజ్ఞ చేయించారు. మండల టీడీపీ అధ్యక్షులు కొసరాజు బాపయ్య చౌదరి, వల్లభనేని వెంకట్రావు, జంగం మోహనరావు, పొట్లూరి రవికుమార్, చాపరాల బాలాజీ, జనసేన నాయకుడు చిలంకుర్తి వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, ఎంపీడీవో టి.విజయసారథి, తహసీల్దారు లోకరాజు, ఎస్సై జి.వి.వి సత్యనారాయణ, వీఆర్‌వో ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పామర్రు : గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార సాధనకోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజావేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం సాయంత్రం గ్రీవెన్స్ డే నిర్వహించారు. సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం నూతన పింఛన్లు, రేషన్‌కార్డులతోపాటు పేదలకు నివేశన స్థలాలను అందిస్తుందన్నారు. ప్రజలు వాటిపై ఎలాంటి అపోహలు పడవద్దని ఎమ్మెల్యే హామీఇచ్చారు.

రెండో రోజుకు పావనగిరిమాత ఉత్సవాలు

నందివాడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పావనగిరి మాత రెండో రోజు ఉత్సవాల్లో భాగంగా గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం రాత్రి పాల్గొన్నారు. ముందుగా ఆయన ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజలకు అభివాదాలు చేస్తూ ఏసు ప్రభువు శిలువ కొండ వద్ద మరియమాత, క్రీస్తు దేవుని స్వరూపాలను దర్శించుకున్నారు. అనంతరం పార్టీ నాయకులతో, గ్రామస్థులతో దైవ సేవకులు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, మండల డీసీ ఛైర్మన్ ఏసుబాబు, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ రామశాస్త్రి, రవి, శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు శ్రీనివాసరావు, సర్వేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పావనగిరిమాత ఉత్సవాల్లో పాల్గొన్న వెనిగండ్ల రాము, టీడీపీ నేతలు

ఘనంగా గంగానమ్మతల్లి జాతర

పామర్రు, మార్చి23 (ఆంధ్రజ్యోతి): భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి చెందిన పామర్రు గంగానమ్మ తల్లి వార్షిక జాతర నెలసంబరమహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే అమ్మవారికి 108బిందెల చెరువునీటితో ఆలయమహిళలు స్నానాలు చేయించారు. పంబలవారు సన్నాయిమేళతాళాలతో అమ్మవారిఘటం, పోతురాజుగెడలకు ప్రత్యేక పూజలు చేశారు. పలువురు పసుపు , కుంకుమలతో ఓలలాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



మొక్కుబడులు చెల్లించుకుంటున్న భక్తులు

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

కూచిపూడి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని మొవ్వ, పెడసనగంటిపాలెం గ్రామాల్లో ఆదివారం పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2800 నగదు, మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు కూచిపూడి ఎస్సై కె.ఎస్.విశ్వనాథ్ తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు.

స్వాతంత్ర్య సమరయోధులను ఆదర్శంగా తీసుకోవాలి : సీపీఎం

గుడివాడ, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వంటి వారిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ సీపీ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్యభవన్‌లో స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల 94వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణరావు, టైలరింగ్ అసోసియేషన్ అధ్యక్షులు లాజర్, నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, ప్రజాసంఘాల నాయకులు రేపాని కొండ, లంకా సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థకు విరాళాలు

గుడివాడ : మానవతా స్వచ్ఛందసంస్థకు ఆ సంస్థ సభ్యులు దుడ్డు వెంకటేశ్వరరావు రూ.5,116లు, సంస్థ సంయుక్త కార్యదర్శి చలువాది మోహనరావు రూ.2516లు విరాళంగా అందజేశారు. ఆదివారం స్థానిక మానవతా స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఎంఈవో వరికూటి రామచంద్రరావును ఘనంగా సత్కరించారు. సంస్థ షెడ్డు నిర్మాణ నిమిత్తం విరాళాలు ఇవ్వాలని సంస్థ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు జయలక్ష్మి కోరారు. కన్వీనర్ మారుతీప్రసాద్, గోపిరెడ్డి, ఛైర్మన్ వేణుగోపాలరావు, కార్యదర్శి నందమూరి పద్మజ, కోశాధికారి చంద్రశేఖరరావు, సభ్యులు రామకృష్ణ, బి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

పీ-4 సర్వే ద్వారా కుటుంబ వివరాలు నమోదు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండలంలో పీ-4 సర్వే విస్తృతంగా కొనసాగుతోంది. ఈ సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలతో పాటు ఆస్తుల వివరాలు నమోదు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు ఎంతమంది, ద్విచక్ర వాహనం, నాలుగు చక్రాల వాహనం ఉందా, కరెంటు ఉందా, టీవీ ఉందా, మంచినీటి కుళాయి కనెక్షన్ ఉందా తదితర వివరాలను అడిగి నమోదు చేస్తున్నారు.

ఒరిగిన కరెంటు స్తంభం

తోట్లవల్లూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఐలూరులో కరెంటు లైన్లు ప్రమాదకరంగా తయారయ్యాయి. గ్రామం పక్కనే పంట పొలంలో కరెంటు స్తంభం ప్రక్కకు ఒరిగిపోయి ప్రమాదకర స్థితిలో ఉంది. దీంతో విద్యుత్ తీగెలు ఎప్పుడు తెగి కింద పడతాయోనని రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఈ వేసవిలోనే కరెంటు స్తంభాలను నిలబెట్టాలని రైతులు కోరుతున్నారు. అలాగే ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్క సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం పైకి పిచ్చికాడ ఎగబాకుతుంది. ఇది దట్టంగా పెరిగితే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాల తీగెలను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఐలూరులో పక్కకు ఒరిగిన స్తంభం

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 435



సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో భక్తుల రద్దీ

మోపిదేవి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల భక్తులు స్వామి దర్శనం కోసం బారులు తీరారు. నాగపుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో సహాయక ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.



తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో 3.80 మీటర్లకు తగ్గిన నీటిమట్టం



బందరు పంపుల చెరువులో తగ్గిన నీటి నిల్వలు

తాగునీటికి కటకటే

●తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో పడిపోయిన నీటిమట్టం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం నగరంతో పాటు మచిలీపట్నం రూరల్ మండలం, పెడన మునిసిపాలిటీలకు తాగునీరందించే తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో 5.19 మీటర్లు ఉండాల్సిన నీటి మట్టం 3.80 మీటర్లకు పడిపోయింది. తరకటూరు సమ్మర్ స్టోరేజ్‌లో 3300 మిలియన్ లీటర్ల నీటి నిల్వలు ఉండాల్సి ఉంది. ప్రస్తుతం 2203 మిలియన్ లీటర్ల నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయి. మూడు స్తంభాల సెంటర్‌లోని పంపుల చెరువులో 13 అడుగులు ఉండాల్సిన తాగునీటి మట్టం 11 అడుగులు మాత్రమే ఉంది. పంపుల చెరువులో 440 మిలియన్ లీటర్ల నీటి నిల్వలు ఉన్నాయి. ఈ నీరు 50 రోజుల పాటు వచ్చే అవకాశం ఉంది. అయితే వేసవిలో ఎండలకు నీరు ఇంకిపోయే ప్రమాదం ఉన్నందున కాల్వలకు నీరు ఎప్పుడి స్తారా అని అధికారులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే నగరంలో రోజు విడిచి రోజు తాగునీరందిస్తున్నారు. నాలుగు డివిజన్లలో సంపుల ద్వారా నీరందిస్తున్నారు. 41, 45, 46, 47 డివిజన్ల పరిధిలోని బలరామునిపేట, నిజాంపేట, టెంపుల్ కాలనీ, ఈడేపల్లిలో కొంత భాగం తాగునీటి సమస్య నెలకొని ఉంది. మచిలీపట్నంలో రెండు లక్షల జనాభా ఉండగా రోజుకు తల ఒకటికి 135 లీటర్లు అందించాల్సి ఉంది. అయితే నీటి నిల్వలు తగినంత లేకపోవడంతో 110 లీటర్లతో సరిపెడుతున్నారు. నీటి నిల్వలు చాలినంతగా లేకపోవడంతో రోజు విడిచి రోజు నీరందిస్తున్నారు. గత వైసీపీ పాలనలో వేసవిలో మూడురోజులకొకసారి తాగు నీరందించిన దాఖలాలున్నాయి. కనీసం రోజు విడిచి రోజు తాగునీరందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. తాగునీటి సమస్యపై ఇరిగేషన్, మునిసిపల్, రెవెన్యూ అధికారులతో మంత్రి కొల్లు రవీంద్ర సమీక్షించారు.

ప్రారంభానికి నోచుకోని గిలకలదిండి, మాచవరం ఓవర్‌హెడ్ ట్యాంకులు



నగరంలో 19 ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉండగా వాటిలో గిలకలదిండి, మాచవరం ఓవర్‌హెడ్ ట్యాంకులు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. గిలకలదిండి, మాచవరం ప్రాంతాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎద ుర్కొంటున్నారు. స్లమ్ ఏరియాలకు వేసవిలో ట్యాంకర్లు పంపించాల్సి ఉంది. ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వైఎస్ఆర్ కాలనీ, ఆదర్శనగర్, టెంపుల్ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, రాజుపేట, పాత రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఇప్పటికే ప్రజలు తాగునీటి కోసం ఎదురు చూపు లు చూస్తున్నారు. తాగునీటి పైపు లైన్లు లీకులు కావడంతో కొన్ని ప్రాంతాల్లో మురుగునీరు వస్తోంది. పైపులైన్లకు మరమ్మతులు చేయించాల్సి ఉంది. కృష్ణానది నుంచి నేరుగా మచిలీపట్నానికి నీటిని తీసుకు వచ్చే బృహత్తర ప్రాజెక్టు నెరవేరలేదు. ఈ ప్రాజెక్టు అమల్లోకి వస్తే మచిలీపట్నంతో పాటు పలు ప్రాంతాల ప్రజల తాగునీటి సమస్య పరిష్కారమవతుంది.

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు

మండలంలోని కోన, పోలాటితిప్ప, తాళ్లపాలెం, పల్లెతుమ్మలపాలెం తదితర గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కోన గ్రామంలో పంపుల వద్ద మహిళలు తగాదాలు పడుతున్న సందర్భాలు ఉన్నాయి. పెదయాదర ప్రాంతంలోని దళితవాడల్లో తాగునీటి సమస్య నెలకొంది. ఎంపీ వల్లభనేని బాలశౌరి సహకారంతో ఆ గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. ఈ పథకం నిర్మాణం కార్యరూపం దాలిస్తే ఆ గ్రామ ప్రజలు దాహార్తి నుంచి బయటపడే అవకాశం ఉంది. చిన్నాపురంలో మరో తాగునీటి చెరువు నిర్మాణానికి పథకా లు రూపొందించారు. ఈ పథకం కార్యరూపం దాలిస్తే చిన్నాపురం పరిసరాల్లోని నాలుగు గ్రామాల దాహార్తి తీరే అవకాశం ఏర్పడుతుంది.



చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పోస్తున్న మంత్రి రవీంద్ర

వెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం

మచిలీపట్నం టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. వెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య), జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, వెలుగు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాబు, రేపల్లె వసంతరావు, కంచనపల్లి కృష్ణ మోహనరావు, వేణుకుమార్, పి.వి. ఫణికుమార్ పాల్గొన్నారు.



బీచ్‌లో పర్యాటకులకు సూచనలు చేస్తున్న మెరైన్ పోలీసులు

సముద్రంలో గుంతలు ఉంటాయి జాగ్రత్త

కోడూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో గుంతలు ఉంటాయని, స్నానం చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని మెరైన్ ఎస్సై పూర్ణ మాధురి తెలిపారు. పాలకాయితిప్ప బీచ్ వద్ద సరదాగా గడిపేందుకు, స్నానాలు చేసేందుకు కుటుంబ సమేతంగా వచ్చిన సందర్శకులకు సూచనలు, సలహాలు అందించారు. సముద్రతీరంలో పిల్లలని ఒం టరిగా వదలరాదని హెచ్చరించారు. మెరైన్ సిబ్బంది తీరం వెంబడి గస్తీ నిర్వహించారు.



సంపటాలమ్మ గ్రామసంచారం ప్రారంభం

చల్లపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి గ్రామదేవత సంపటాలమ్మ గ్రామసంచారం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. పూజారి చల్లపల్లి కోటేశ్వరరావు దంపతులు, అమ్మవారి పుట్టింటివారైన పత్తిపాటి కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. ఘటం బిందెను ఆలయం నుంచి బయటకు తీసుకురాగా, జయజయధ్వానాల నడుమ అమ్మవారు గ్రామ సంచారానికి బయలుదేరారు. తొలుత పడమరవీధిలోని పుట్టింటి పత్తిపాటి వారింటికి వెళ్లి పసుపు కుంకుమలు స్వీకరించిన తర్వాత తిరిగి ఆలయానికి వచ్చి అక్కడి నుంచిగ్రామంలో సంచరించారు. కోటేశ్వరరావు కుమారులు చల్లపల్లి నరేష్, పూర్ణ అమ్మవారి ఘటం బిందెను శిరస్సున ఉంచుకుని గ్రామంలో సంచరించారు. భక్తులు వార పోసి పసుపు కుంకుమలు సమర్పించారు. చల్లపల్లి మున్సిసబ్ గొర్రెపాటి పిచ్చేశ్వరరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు విన్నకోట శంకర్, పత్తిపాటి రత్నం తదితరులు పాల్గొన్నారు.



బాబావలి దర్గా ఉరుసు మహోత్సవంలో పాల్గొన్న మండలి దంపతులు


వైభవంగా ఉరుసు మహోత్సవం

కోడూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పెద్దగుడుమోటులో హజరత్ బెంగాలీషా బాబావలి దర్గా ఉరుసు మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. మందపాకల, పోటుమీద, నాగాయలంక, లింగారెడ్డిపాలెం, కోడూరు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆటగుర్రం ప్రదర్శన, చందనోత్సవం జరిగాయి. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు ఉరుసు మహోత్సవానికి విచ్చేయగా, జహీరుల్లా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎస్సై చాణిక్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. టీడీపీ, జనసేన నాయకులు బండే శ్రీనివాసరావు, అప్పికట్ల రవీంద్ర, యర్రంశెట్టి దామోదర్, కూటమి నాయకులు మహమ్మద్ ఇమ్రాన్, షేక్ బాబావలీ, కోట రాంబాబు, పూతబోయిన సాయిబాబు, కోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా సహస్ర ఘట క్షీరాభిషేకం

మచిలీపట్నం టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : బుట్టాయిపేటలో చిట్టి పిళ్ళారయ్య స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సహస్ర ఘటాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. వేదపండితులు విష్ణుభొట్ల సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు సౌరయాగం నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఈశ్వరి మీనాక్షికి మంత్రి రవీంద్ర తదితరుల నివాళి

మచిలీపట్నం టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావు మాతృమూర్తి నడకుదిటి ఈశ్వరి మీనాక్షి సంతాప సభ ఆదివారం మలకాపట్నంలో జరిగింది. మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎమ్మెల్యే మోపిదేవి వెంకటరమణ, టీడీపీ నాయకులు గోపు సత్యనారాయణ, కొక్కిలిగడ్డ నాగరమేష్, మెండు భానుమూర్తి, లంకే నారాయణ ప్రసాద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు, పి.వి. ఫణికుమార్ తదితరులు పాల్గొని ఈశ్వరి మీనాక్షి చిత్రపటానికి నివాళులర్పించారు.



బండ్రెడ్డి రామారావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, జనసేన నేత బండి రామకృష్ణ

జనసేన అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణకు పితృవియోగం

●బండ్రెడ్డి రామారావు కన్నుమూత ● మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే కాగిత, బండి రామకృష్ణ తదితరుల నివాళి

మచిలీపట్నం టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణకు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి బండ్రెడ్డి రామారావు (75) శనివారం రాత్రి బందరు మండలం ఉల్లిపాలెంలో మృతి చెందారు. రామారావుకు బండ్రెడ్డి రామకృష్ణ, సురేష్ ఇద్దరు కుమారులు. బండ్రెడ్డి రామారావు మచిలీపట్నం మునిసిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి మచిలీపట్నం సమీపంలోని ఉల్లిపాలెంలో నివసిస్తున్నారు. రామారావు భౌతికకాయాన్ని మంత్రి కొల్లు రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి నాగఛాయాదేవి, టీడీపీ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, జనసేన నాయకులు కొట్టి వెంకట్రావు, మాదివాడ రాము, నగర అధ్యక్షుడు గడ్డం రాజు సందర్శించి నివాళులర్పించారు. బండ్రెడ్డి రామకృష్ణను మంత్రి కొల్లు రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పరామర్శించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రామారావు అంత్యక్రియలు సోమవారం జరుగుతాయి. **గూడూరు** : బందరు మండలం ఉల్లిపాలెంలో బండ్రెడ్డి రామకృష్ణ తండ్రి రామారావు పార్థివదేహానికి ఆదివారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. రామకృష్ణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహన త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పోతురాజుస్వామి నెల జాతర

నాగాయలంక, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నాగాయలంకలో పోతురాజు స్వామివారి నెల జాతర ఆదివారం ఘనంగా జరిగింది. భక్తులు నైవేద్యాలు సమర్పించి, మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ప్రకటన

శ్రీపతి బాల సుబ్రహ్మణ్యం అనే నేను కృష్ణ జిల్లా మోపిదేవి మండలం కు చెందిన న్యాయవాదిని. నా క్లయింట్ అయిన బండ్రెడ్డి లక్ష్మీనాథ్ గారు మోపిదేవి లో డాక్టర్ గా పని చేయుచున్నారు. వారు మోపిదేవి టెంపుల్ వద్ద నుండి కొక్కిలిగడ్డ రోడ్, చందమామ ఎస్టేట్స్ కు ది.02/03/2025 న ఇల్లు మారినారు. ఇల్లు మారె క్రమంలో ఒక స్థిరాస్తి నివేశన స్థలమునకు చెందిన దస్తావేజు (No.7941/2008) పోయినది.

గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, ఆత్మకూరు గ్రామం లో R.S.No.124/2 లో అభినందన హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి వెంచర్ నందు బండ్రెడ్డి లక్ష్మీనాథ్ అనే నా క్లయింట్ మరియు అతని సోదరుడైన బండ్రెడ్డి షణ్ముఖి ఇద్దరు కలిసి Plot No.105 లో గల 428 చ.గ. స్థిరాస్తి నివేశన స్థలమును ది.15/10/2008 న SRO మంగళగిరి నందు దస్తావేజు నెం.7941/2008 ద్వారా కొనియున్నారు. కావున సదరు దస్తావేజు ఎవరికైనా దొరికినచో తిరిగి ఇవ్వవలసినది గా మనవి. తిరిగి ఇచ్చిన వారికి తగిన పారితోషకం ఇవ్వబడును.

(Document No. 7941/2008, registered at Mangalagiri SRO in the name of Bandreddi Laxmi Nadh and Bandreddi Shanmukhi)

ఇట్లు : శ్రీపతి బాలసుబ్రహ్మణ్యం, న్యాయవాది.
Cell : 9505027579, 9676453527.

బుద్ధప్రసాద్‌కు జనసేన నేతల ఆత్మీయ సత్కారం



అవనిగడ్డ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు ఆదివారం సత్కరించారు. శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా నియమితులు అవ్వటం చాలా సంతోషంగా ఉందన్నారు. జనసేన నాయకులు ఆళ్లమల్ల చందుబాబు, అన్నపురెడ్డి ఏసుబాబు, మత్తి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్** : ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన మండలి బుద్ధప్రసాద్‌ను మోదుమూడి గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు బచ్చు వెంకట నారాయణ ఘనంగా సత్కరించారు.



పేద విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

చల్లపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులు ప్రతిభతో ఎదగాలని ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ అన్నారు. పురిటిగడ్డ ఐవీఎం హోంలో డాక్టర్ సురేష్ - రోజా దంపతులు తమ ఆర్థిక సహకారంతో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకూ చదువుకుంటున్న 280 మంది విద్యార్థులకు పరీక్ష అట్టలు అందజేశారు. ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. వేములపల్లి స్విటిన్ రాస్, వేములపల్లి సోఫి, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి పాధాన్యం : ఎమ్మెల్యే మండలి

అవనిగడ్డ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో పేదల ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో చల్లపల్లి, అవనిగడ్డ, మోపిదేవి, కోడూ రు, నాగాయలంక, ఘంటసాల మండలాల్లోని 60 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ .53,95,152 లను ఎల్‌వోసీలను అందజేశారు. **ఘంటసాల** : మండల పరిధిలోని దేవరకోట గ్రామానికి చెందిన కొడాలి భాగ్యాలరావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1,20,000 ఎల్‌వోసీని ఆదివారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అందజేశారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్న భాగ్యాలరావు డిసెంబర్ నెలలో జరిగిన వ్యవసాయ పనుల్లో కాలు విరిగింది. విజయవాడ క్యాపిటల్ ఆసుపత్రిలో వైద్యసహాయం పొందుతున్నాడు. ఇప్పటికీ రూ.2.70 లక్షల వరకు ఖర్చు కాగా, కాలికి ఆపరేషన్ చేయాల్సి ఉంది. ఎమ్మెల్యే చొరవతో ఎల్‌ఓసీ మంజూరు కావటం పట్ల ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు దోనేపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంగానమ్మ మూలవిరాట్‌ను తాకిన సూర్యకిరణాలు

కోడూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కోడూరులో గంగానమ్మ అమ్మవారి ఆలయంలో అరుదైన దృశ్యం కనిపించింది. ఆదివారం ఉదయం 6.47 గంటలకు ఆలయ ముఖ మండపం దాటి అమ్మవారి గర్భగుడిలోని మూల విరాట్‌పై నేరుగా సూర్యకిరణాలు పడినట్లు ఆలయ అర్చకులు కొమ్మూరు శ్రీనివాస్ శర్మ తెలిపారు. ఆలయ 50వ వార్షికోత్సవ సన్నాహ సందర్భంలో అరుదైన దృశ్యం కనిపించటం విశేషంగా ఉందన్నారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ దృశ్యాన్ని చూసేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో హోమియో వైద్యశిబిరం

చల్లపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం జరిగింది. డాక్టర్ మణికంఠ రోగులను పరీక్షించారు క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా మందులు అందజేశారు. వాసవీక్లబ్ అధ్యక్షురాలు మాజేటి అమరవాణి, గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావు, దింటకుర్తి జ్యోతి, అన్నం సత్యవాణి, జూపూడి కిరణ్, ఉరిమి సువర్చల తదితరులు పాల్గొని శిబిరాన్ని పర్యవేక్షించారు.

ఆర్యవైశ్య నేత కొల్లూరి చిన్నా ఔదార్యం

పెడన, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పక్షవాతంతో బాధపడుతున్న దంపతుల పట్ల ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కొల్లూరి చిన్నా ఔదార్యం చూపారు. ప్రదర్శించారు. గూడూరు మండలం కంకటావ గ్రామానికి చెందిన భార్యాభర్తలు ఆంజనేయులు, సముద్రవేణి కొంత కాలంగా పక్షవాతం వ్యాధితో బాధపడుతున్నారు. బతుకు దుర్భరంగా మారింది. ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు కొల్లూరి చిన్నా ఆదివారం కంకటావ గ్రామం వెళ్లి ఆంజనేయులు, సముద్రవేణి దంపతులకు రూ. 10వేల విలువ గల రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసరాలు, మందులు అందజేశారు.

సూర్యనారాయణస్వామి శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వేకనూరు సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం అర్చకులు రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు తుంగల వీర వసంతరావు - ఇందిరా దంపతులు పర్యవేక్షించారు. అందె వెంకటేశ్వరరావు తండ్రి రామస్వామి ఆర్థిక సహకారంతో అన్నదానం నిర్వహించారు.



భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులకు ఘననివాళి

మచిలీపట్నం టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు యువతకు ఆదర్శమని బీజేపీ నాయకుడు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి అన్నారు. కూనపరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో గొడుగుపేటలో భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు బలిదాన్ దివస్ జరిగింది. గుమ్మడి విద్యాసాగర్, నేతాజీ మిత్ర మండలి సభ్యులు పాల్గొన్నారు. **గూడూరు** : మల్లవోలు గ్రంథాలయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ గోవాడ ప్రశాంతి నివాళులర్పించారు.